| | | | | |
|---|---|---|---|---|
| Name | : | B. Usha Kiron | | |
| Educational qualification | : | B. Tech | | |
| Subjects Dealing with | : | Mathematics | IIT (8th, 9th, 10th) | State (8th, 9th, 10th) |
| | | General Science | IIT Physics | 6th and 7th |
| | | Physical Science - 8th | | |
| Experience | : | 20 years | | |
| Present working school | : | A.K & K. English Medium High School<br>Chirala, Bapatla District. A.P. | | |
| School Dise code | : | 28182300407 | | |

ఉద్యోగాన్వేషణలో ఉంటూనే ఖాళీగా ఉండటం ఇష్టంలేక ఒక ప్రభుత్వేతర పాఠశాలలో గణిత ఉపాధ్యాయినిగా చేరాను. అయితే పిల్లల ఆలోచనాత్మక, ఆసక్తికర సందేహాలను తీర్చడం, వారితో ఆడుతూపాడుతూ గణితాన్ని సులభతరంగా వివరించడం నాకు చాలా తృప్తిని కలిగించింది. దానితో ఇదే నా వృత్తిగా స్వీకరించి  గత ఇరవై సంవత్సరాలుగా విద్యా విషయాలతోపాటు నైతిక, జీవిత విలువలను విపులీకరిస్తున్నాను. భగవంతుని ఆశీస్సులతో, పిల్లల ప్రేమానురాగాలబలంతో వారితో కలసి అడుగులు వేస్తున్నాను. పిల్లల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచుతూ ఉత్తమమైన ఆశయాలు కలిగివుండేలా ప్రోత్సహిస్తూ నాదైన బాణీలో జాతినిర్మాణం కోసం నా కృషిని కొనసాగిస్తున్నాను. సర్వేజనాః సుఖినోభవంతు !

# ఆచార్య దేవోభవ

## గురువు ఒక జాతి నిర్మాత




**ఉపోద్ఘాతము:** నిజమే కదా! ఒక వ్యక్తి ఎంత ఉన్నతమైన స్థితిలోవున్నా, సమాజానికి ఉపయోగపడే పనులుచేస్తున్నా, దేశాభివృద్ధికి పాటుపడుతున్నా, సాంకేతిక ఉత్పాదక రంగాలలో పురోగతి సాధిస్తున్నాఆవ్యక్తి జ్ఞానసంపద,పరోపకారబుద్ధి, ధనసంపత్తి వెనుక తన **గురువులవద్ద** నేర్చుకున్న చదువు సంస్కారాలే పునాదిరాళ్ళు.విద్యార్థులకొక గురినీ,దానిని చేరుకునే మార్గాన్ని బోధించాలనే గురుతర బాధ్యతలను భుజస్కంధాల మీదమోస్తూ,వారి జ్ఞానసముపార్జనకు తోడ్పడుతూ,ఉన్నత సంస్కారవంతులుగా తీర్చిదిద్దుతూ, ఉత్తమపౌరులుగా మలచడానికి దేశపటిష్ఠ నిర్మాణంకోసం అకుంఠితదీక్షతో నిరంతరయాగం చేస్తున్న గురువులందరికీ నా హృదయపూర్వక నమస్సుమాంజలులు మరియు శుభాకాంక్షలు.

**గురువు అంటే...** గురుగీతలో గురువును చీకటిని పారద్రోలేవాడు అని సముచితంగా వర్ణించబడింది. నిజమైన, దివ్యజ్ఞాన సంపన్నుడైన గురువు, తాను స్వీయనియంత్రణ సాధించడంవలన,సర్వవ్యాపకమైన పరమాత్మతో ఏకత్వానుభూతిని చెందినవాడు. ఎవరిని గురువు అనవచ్చు అనేప్రశ్నకు ఆదిశంకరులవారు "కో గురుః?" -గురువు ఎవరని ప్రశ్నించి తానే ఈలాగు సెలవిచ్చారు- "అధిగత తత్వః శిష్య హితాయోగ్యతస్సతతం"- ఎవరైతే శాస్త్రోక్తమైన తత్వాన్ని గ్రహించిఉన్నారో, ఎవరైతే శిష్యునియొక్క సంశయాలు తీర్చగలిగి ఉంటారో,ఎవరైతే శిష్యులయొక్క హితమునే సదా కోరుతూ వుంటారో ఆ వ్యక్తియే గురువు అనే పదానికి యోగ్యుడవుతాడు. ఆపస్తంభమహర్షులవారు, "ఆచరోదిద శాస్త్రార్థం ఆచార స్థాపయత్యపి స్వయమ్ ఆచరతేయస్మాత్ తస్మాదాచార్య ఉచ్చతే "- శాస్త్రార్థాన్ని చక్కగా తెలుసుకుని దానిని స్వయంగా ఆచరిస్తూ అన్యులతో ఆచరింపజేసేవాడు ఆచార్య శబ్దానికి అర్హుడు అని చెప్పారు. వేమన శతకంనుండి ఒక పద్యం

గురువు చిల్లగింజ కుంభ మీదేహంబు
ఆత్మ కలుష పంక మడుగుబట్టు
తేరి నిలిచేనేని దివ్యామృతంబురా
విశ్వదాభిరామ వినురవేమ

తాగే నీటికుండలో నీరు కలుషితమైనప్పుడు చిల్లగింజను వేస్తే కొంతసేపటికి నీరంతా తేటబడి బురద అంతా కిందకి దిగి అమృతసమానమైన నీరు పైకి తేరుతుంది. అదేవిధంగా గురువు చిల్లగింజ వంటివాడు. చిల్లగింజ బురదనీటిని శుభ్రపరచినట్టే గురువు కూడా కలుషితమైన దేహాత్మలను తన బోధనలతో తేటపరచి జీవితాలను అమృతమయం చేస్తాడు.

దేశవిదేశాలలో భారతజాతి గౌరవాన్ని ఇనుమడింపజేసి ఉపాధ్యాయవృత్తికి వన్నెతెచ్చిన పండిట్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు మాట్లాడుతూ గురువుకి శిష్యులపట్ల తల్లిప్రేమలాంటి ప్రేమ వుండాలని, నిరంతర పఠనాసక్తి కలిగివుండాలని అన్నారు. ప్రథమ మహిళాఉపాధ్యాయురాలు శ్రీమతి సావిత్రిబాయి పూలె "మేల్కొనండి, లేవండి, బోధించండి,దురాచారాలను రూపుమాపండి" అని గురువులకు పిలుపునిచ్చారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్, "బోధనయొక్క ముఖ్యోద్దేశం పాఠాన్ని వివరించడం కాదు కాని గుండె తలుపుల్ని తట్టడం" అని గురువు బాధ్యతను గుర్తుచేశాడు. భారతజాతి గర్వకారణం శ్రీ అబ్దుల్ కలాం "ఈదేశం మొత్తంమీద నేను గౌరవించే వృత్తి ఏదైనా ఉందంటే అది ఉపాధ్యాయవృత్తే ఎందుకంటే అసలు ఈ దేశ భవితవ్యమంతా వారి చేతుల్లోనే వుంది" అని ఉటంకించారు. మరెందరో గురువుల ప్రాముఖ్యాన్ని వేనోళ్ల నుతించారు.

**నా అవగాహన:** గురువంటే ఒక వ్యక్తో, శక్తో కాదుకాని ప్రకృతిలోని సమస్తము మనకు గురువులే. గంభీరంగా,నిశ్చలంగా ఉండమని బోధించేగురువు పర్వతం. నిర్మలంగా ఉండమని బోధించేగురువు సెలయేరు. నిస్వార్థమైన ప్రేమని పంచమని బోధించే గురువు చెట్టు. సహనాన్ని బోధించేగురువు భూమి. జ్ఞానార్జనకు హద్దులు లేవని బోధించేగురువు ఆకాశం. మనది కానిదానిని తిరిగి ఇచ్చేయాలని బోధించేగురువు సముద్రం. కులమత, ధనిక, పేద భేదాలు లేవని సమానత్వాన్ని బోధించేగురువులు గాలి, సూర్యచంద్రులు.ఉపయోగకరంగా జీవించమని బోధించేగురువు ఉప్పు. బిడ్డలను రెక్కలచాటున దాచి కాపాడమని బోధించేగురువు కోడి. ముందుజాగ్రత్త, క్రమశిక్షణను బోధించేగురువు చీమ. వెలుతురు ఉనికిని గొప్పతనాన్ని బోధించేగురువు చీకటి. ఇలా ఎన్నెన్నో..

బతకలేక బడిపంతులు అనేది ఒకప్పటి నానుడి. కానీ, బ్రతకడానికి ఉపయోగపడేదీ, బ్రతుకుబాటను సుగమం చేస్తూ సుజాతి నిర్మాణానికి శ్రీకారం చుట్టేదీ గురువులేనని ప్రస్తుతం సర్వత్రా గుర్తించడం హర్షదాయకం. ఉపాధ్యాయవృత్తిని హెచ్చిస్తూ, వారి ఔన్నత్యాన్ని ప్రపంచానికి తెలియజేస్తూ సత్కరించి, గౌరవిస్తున్న విద్యాపోషకులకు హృదయపూర్వక అభివందనాలు.

**ఒక యధార్థ ఉదాహరణ:** అమెరికాలోని ఒక పాఠశాలలో ఒక తరగతి విద్యార్థులు కొంటెపిల్లలు. వారికి విద్యాబుద్ధులు నేర్పించడం ఎవరితరంకాదని బాధపడుతున్న సమయంలో ఛార్లెస్ అనే ఉపాధ్యాయుడు వచ్చాడు . పిల్లలు యధాప్రకారం గొడవచేశారు. కానీ ఛార్లెస్ వారిని ప్రేమగా దగ్గరకు తీసుకుని పొగుడుతూ వారి మనసులను

చూరగొన్నాడు. మూడునెలలలోనే పిల్లలంతా ఉత్తమ విద్యార్థులుగా గుర్తించబడ్డారు. ఒకరోజు అతను పాఠశాలకు రాలేదు. ఆ రోజేకాదు వారంరోజులు రాలేదు. పిల్లలంతా ప్రధానోపాధ్యాయుని దగ్గరకువెళ్లి కారణం అడిగారు. అప్పుడాయన - ఛార్లెస్ పొరపాటు వలన అతని భార్యాబిడ్డలు చనిపోయారనీ, అందుకతనికి ఉరిశిక్ష విధించారనీ, అతను అధికారులతో తనకు ఉపాధ్యాయునిగా పనిచేసే అవకాశాన్ని చివరికోరికగా భావించి యిమ్మని కోరాడనీ, మొదట అధికారులు ఒప్పుకోకపోయినా తరువాత కాపలాదారుని నియమించి వారి పాఠశాలకు పంపారనీ, ఇప్పుడా కాలవ్యవధి ముగియడంతో అతను తిరిగివెళ్ళాడనీ చెప్పారు. పిల్లలంతా చాలా దిగులుపడ్డారు. వెంటనే ఉన్నతాధికారుల **వద్ద** కువెళ్లి ఆయన చాలామంచివాడని, ఆయన పొరపాటును మన్నించి విడిపించమని హఠం వేశారు. చివరకు ఛార్లెస్ విడుదలయ్యాడు. ఉత్తమగురువు ఉత్తమవిద్యార్థులను తయారుచేస్తే అది ప్రాణాలను నిలుపుతుందని ఋజువుచేసే సంఘటన. *"Rome was not built in a day"* ఏదీ రాత్రికి రాత్రే నిర్మించబడదు. సహనం, పట్టుదల, కృషి,వీటికి ఉత్తమ మార్గదర్శకత్వం తోడైతే సుజాతి నిర్మాణం సుగమం అవుతుంది.విద్యార్థి గురువు చేతిలో మట్టిముద్దలాంటివాడు. దానిని అందంగా, ప్రయోజనకరంగా మలచగలిగే శక్తిసామర్థ్యాలు గురువుకు మాత్రమే వున్నాయి. అందుకు గురువును జాతినిర్మాత అనడం సమంజసమే.

**విద్యార్థులపై నా ప్రభావం:** ఎప్పుడూ నావిద్యార్థులకు నేను చెప్పేమాటలు:1) సందేహమున్నప్పుడు అడగటానికి సిగ్గుపడకూడదు. 2) మనవల్ల పొరపాటు జరిగినప్పుడు నిజాయితీగా ఒప్పుకోవాలి. 3) తప్పుచేయనంతవరకూ దేనికీ భయపడకూడదు. 4) తెలిసిన విషయాన్ని ధైర్యంగా చెప్పాలి. 5) ఎవరేమనుకుంటారోననే పిరికితనాన్ని విడిచిపెట్టాలి. 6) ఇబ్బందుల్లో వున్నవారికి చేతనైనంత సహాయం చేయాలి. 7) నాకేం లభించిందని కాకుండా నేనేం చేయగలనని ఆలోచించాలి. 8) భగవంతుడిచ్చిన జ్ఞానాన్ని మంచి పనులకుపయోగించాలి.

9) తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చడం కర్తవ్యంగా భావించాలి. 10) అందర్నీ గౌరవించాలి.

గత యేడాది కోవిడ్ సమయంలో నా పూర్వ విద్యార్థులు కొందరు వైరస్ బాధితులకు ఆక్సిజన్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేశారు. ధనసహాయం చేశారు.సరుకులను, కొన్నిచోట్ల ఆహారపదార్థాలను అందించారు. మాస్కులు పంచారు. నేను అభినందించినప్పుడు "మీరు మాకు లెక్కలు మాత్రమే కాదు నైతికవిలువలు కూడా నేర్పారు, ఎప్పుడు వెనక్కి తిరిగి చూసినా మీరే కనబడతారు, మీరు నేర్పినదే" అన్నప్పుడు కన్నీరాగలేదు. పదకొండేళ్లక్రితంనాటి మాట, ఐఐటి ప్రశ్నలు వివరిస్తూ ఒకప్రశ్న మొత్తం చెయ్యకుండానే సులభంగా క్షణాల్లో ఏంజవాబు వ్రాయగలమో చెప్పాను. కళ్యాణ్ నిశితంగా ఆలకించే విద్యార్థి. చెన్నైలో ఐఐటి కళాశాలలో చేరినప్పుడు ఆ ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పటంతో 500రాంకులు ముందుకి వెళ్ళాడు. ఒకసారి అబ్దుల్ కలాం గారు వాళ్ళ విశ్వవిద్యాలయానికి వచ్చి తమిళంలో ప్రసంగిస్తున్నారట. కళ్యాణ్ లేచి "వివిధ ప్రాంతాలనుండి వచ్చిన వాళ్ళమున్నాము, తమిళప్రసంగం మాకు అర్థంకావటం లేదు దయచేసి ఆంగ్లంలో ప్రసంగించ" మని ఆంగ్లంలో అడిగాడట. కలాం గారు మెచ్చుకుని

తన ప్రసంగాన్ని ఆంగ్లంలో కొనసాగించారట. విన్నప్పుడు నేనే స్వయంగా కలాంగారితో మాట్లాడినంత సంతోషం కలిగింది. మరెన్నో సంఘటనలు నావిద్యార్థులు సాధించిన విజయాలు మనసుకెంతో తృప్తినిస్తాయి. ఇంకొక్క చిన్నవిషయం, 17 సంవత్సరాలక్రితం పదవతరగతి పూర్తిచేసిన మాధవి ఈమధ్యనే ఒక విద్యార్థి వివాహంలో కలిసింది. నన్నుచూసి ఆనందంతో లేచివచ్చింది. తను, తనభర్త సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు, ఇద్దరు పిల్లలు. విషయమేమిటంటే తను పట్టుచీర కట్టుకుని పవిటకొంగు చుట్టూతిప్పిపెట్టుకుంది. అది నాఅలవాటు. తనకు నామీద వున్న ఇష్టం కారణంగా ఎప్పుడు చీరకట్టినా అలాగే పెట్టుకుంటుందట. *"The influence of a good teacher can never be erased."*

ఈ సందర్భంలో నా గురువులనుగూర్చి - నేనీ స్థాయిలో ఉండటానికి భగవంతునికృప కారణమైతే జీవితవిలువలు నేర్పినగురువులు నాతల్లిదండ్రులు.నన్ను ప్రభావితంచేసినవారు జ్వాలాంబ-తెలుగు టీచరుగారు ఎంతో మృదువుగా ప్రేమగా స్పష్టంగా పలికించేవారు. దేవరాజ్ మాష్టారు, వినయబాబు సర్ గణితంమీద మక్కువ పెంచారు. వెన్నుతట్టి ప్రోత్సహించే భాగ్యలక్ష్మి మేడమ్ గారు గురుతుల్యులు. అందరికీ శతకోటివందనాలు.

**నా కృషి-ఫలితాలు:** 1)చీరాలలో Interact Clubs వున్న పాఠశాలల మధ్య మా పాఠశాలలో National Mathematics Day Competition నిర్వహించాము.

2) SOF International Olympiads IMO, NSO లలో ప్రతిసంవత్సరం Gold & Siver medals, 1000/- Gift vouchers సాధిస్తున్నారు.

3) కొత్తపేట ZPH పాఠశాలలో గణితప్రదర్శనలో పాల్గొని DEO గారి చేతులమీదుగా certificates,1000/- నగదుబహుమతి అందుకున్నారు.

4) VRS &YRN కళాశాలలో Science Exhibition లో అద్భుతమైన నమూనాలను ప్రదర్శించి 7500/- బహుమతిని చేజిక్కించుకున్నారు.

5) Industrial visit లో భాగంగా వేటపాలెంలోని BBH జూనియర్ కళాశాలలో Agastya Science, Maths and Robotics Labsను సందర్శించి క్రొత్తవిషయాలను నేర్చుకున్నారు.

6) Spell Bee contest లో తమ సత్తాను చాటించారు.




**7) Essay Writing, Elocution & Drawing Competitions లో,**


**ముఖ్యంగా 75 Years of India Glory , Ukraine War అనే అంశాలపై పిల్లల సృజనాత్మకతకు, అద్భుతాలోచనాశక్తికి నిర్వాహకులు సైతం ఆశ్చర్యచకితులయ్యారు.**

Digital class లో గణనసామర్థ్యాన్నిపెంచడానికి Nerdle - the daily number game పరిచయంచేసి Happiness class గా మార్చాను. Models, Paper Cuttings తో పిల్లలకు సులువుగా అర్థమయ్యేలా వివరించడం నా శైలి.






ప్రతిరోజూ Almond for the Brain లో GK ప్రశ్నలడిగి వారిలో జిజ్ఞాసను పెంచుతున్నాను. పిల్లల్లో సమాచారనైపుణ్యం, ఆత్మస్థైర్యం, బహిరంగప్రసంగ నైపుణ్యం, వ్యక్తిత్వనిర్మాణం పెంపొందేలా ప్రోత్సహిస్తూ ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దుతూ సుజాతినిర్మాణానికి నావంతు కృషిచేస్తున్నాను.




**ముగింపు:** బైబిల్ నుండి ఒకమాట, "నీ ఉపదేశము మోసము లేనిదిగాను మాన్యమైనదిగాను నిరాక్షేపమైన హితవాక్యముతో కూడినదిగాను వుండవలెను." మరొకమాట, "బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము వాడు పెద్దవాడైనప్పుడు దానినుండి తొలగిపోడు."

గురువు అంటే **గు**రి

గురువు అంటే **రు**జువు

గురువు అంటే **వు**నికి

గురువు దిక్సూచిలా సముచితమార్గాన్ని సూచిస్తాడు. ఆధ్యాత్మికత, గురుభక్తి, సత్యవాక్కు, ధైర్యం, పట్టుదల, క్రమశిక్షణ, ప్రేమ, జ్ఞానం, త్యాగం, నిస్వార్థం, వినయం, విధేయతలనే నిచ్చెనగా తానే మారి తన విద్యార్థులు దాని మీదుగా విజయోన్నత శిఖరాలనధిరోహించాలని ఆశిస్తాడు.

గురువు నిత్యకృషీవలుడు ఆ కృషి ఫలితమే సమున్నతజాతి నిర్మాణం.

## 🙏 గురుభ్యోన్నమః 🙏